ఇక నుంచి.. వృద్ధులూ సభ్యులే.!



మహిళా ఆర్థిక, సామాజిక అభ్యున్నతికే స్వయం సహాయక సంఘాలు

- కొత్తగా 60 ఏళ్లు దాటిన వారిని కూడా సభ్యులుగా చేర్చుకునేందుకు చర్యలు
- తొలగింపునకు అడ్డుకట్ట
- కొత్త సంఘాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి

సాక్షి, మేడ్చల్ జిల్లా: సమాజంలోని మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా సభ్యులు పేదరికాన్ని అధిగమించేలా 2002 నుంచి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కృషి చేస్తోంది. సంఘాల్లో చేరే సభ్యుల వయస్సును 18 నుంచి 60 ఏళ్లకు పరిమితం చేయడంతో మహిళలు అధిక సంఖ్యలో పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు దూరమవుతున్నారు. దీంతో పేదలను పేదరికం నుంచి విముక్తి చేసేందుకు సార్వత్రిక సామాజిక సమీకరణం (యూనివర్సల్ సోషల్ మొబిలైజేషన్) అనే ప్రధాన ఆశయం దెబ్బతింటోందని గ్రహించారు.

వృద్ధాప్యం అడ్డుకావొద్దని...

వయోపరిమితి, ఇతర కారణాలతో పాదుపు సంఘాల్లో సభ్యుల సంఖ్య తగ్గిపోయింది. కనీస సంఖ్య లేని సంఘాలకు బ్యాంకు రుణాలు లభించని దుస్థి తి నెలకొంది. దీంతో 60 ఏళ్లు దాటిన వృద్ధులకు కూ డా అవకాశం ఇవ్వాలని సంకల్పించారు. వృద్ధురాళ్లతో కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని ప్ర భుత్వం అన్ని జిల్లాల గ్రామీణాభివృద్ధి శాఖను ఆదేశించింది.

మూడు విభాగాలుగా...

60 ఏళ్లు నిండిన వారు, దివ్యాంగులు, 18 ఏళ్లు నిండిన మహిళలను గుర్తించి కొత్త సంఘాలను ఏర్పాటు చేసే ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. తక్కువ సభ్యులున్న సంఘాల్లో కొత్తవారిని చేర్పించడం, వృద్ధ, దివ్యాంగ మహిళలతో ప్రత్యేక స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసేందుకు సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే ఉన్న సంఘాల్లో 60 ఏళ్లు నిండిన వారిని, ఎప్పటికప్పుడు కొత్త సంఘాల్లో చేర్చడం లేదా 60 ఏళ్ల వయసున్న వారి సంఘాల్లో ఖాళీలుంటే వాటిలో భర్తీ చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఇ(ఎల్డర్)ఎస్‌హెచ్‌జీ గుర్తింపు కోడ్‌తో సంఘాలను ఆన్‌లైన్‌లో చేర్చి, వీవోలో నమోదు చేస్తున్నారు.

తొలగింపులకు అడ్డుకట్ట...

కొన్ని చోట్ల సంఘాల ప్రతి నిధులు, గ్రామైక్య సంఘాలు, సమాఖ్యల సభ్యులను వివిధ కారణాలతో తొలగిస్తున్నట్లు గుర్తించారు. 10 మంది కంటే తక్కువగా ఉన్న ఏ సంఘం నుంచి సభ్యులను తొలగించేందుకు వీలులేని విధంగా ఎస్‌హెచ్‌జీ అకౌంటింగ్ యాప్ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. వలసపోయిన, చనిపోయిన సందర్భాల్లో తప్ప ఇతర పరిస్థితుల్లో తొలగించడానికి ఇక వీలుండదు. పలు అంశాలను ప్రామాణికంగా తీసుకొని సంఘాల పనితీరుకు గ్రేడులు ఇస్తారు. రుణాలు, చెల్లింపుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో ప్రస్తుతం ఉన్న సంఘాలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 3,361 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో కీసర మండలంలో 656, ఘట్కేసర్‌లో 782, మేడ్చల్‌లో 769, మూడు చింతలపల్లిలో 526, శామీర్‌పేట్‌లో 623 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి.

కొత్తవి ఏర్పాటు చేస్తున్నాం..

60 ఏళ్లు దాటి, సభ్యులు కాని వారిని గుర్తించి వారితో సంఘాలను ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. పొదుపు సంఘాల్లో చేరేందుకు 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి వారితో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయిస్తున్నాం.

– పద్మజారాణి, గ్రామీణాభివృద్ధి అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ విఫలం

అల్వాల్: ప్రజాసమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మల్కాజిగిరి ఏ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నేరేడ్‌మెట్ డివిజన్‌లోని చంద్రబాబు నాయుడు నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మరియమ్మ చాకో, ఆర్.చంద్రశేఖర్, యర్రోళ నర్సింహ, చిర్ర రాజలింగం, బాలకృష్ణ, నిమ్మ అశోక్‌రెడ్డి, డోలి రమేష్, పాండు, ప్రేమ్‌కుమార్, వెంకటేష్ యాదవ్, చాకో, కుట్టి శ్రీనివాస్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



నేరేడ్‌మెట్ డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదు..

ఉప్పల్: ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాలను ప్రచారం చేస్తూ గురువారం మేడ్చల్– మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు కందిఅశోక్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నేటికీ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలే తప్ప, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ చేసింది ఏమీ లేదని అన్నారు. తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే వరకు కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు తిక్క ప్రకాశ్, నాయకులు పబ్బతి శేఖర్‌రెడ్డి, ప్రతిభ, మేరి, ప్రభావతి, ఈనాశమ్మ, సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాకు చెందిన మైక్రో అబ్జర్వర్లు, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఓపీవోలు తమ విధులను జాగ్రత్తగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహించరాదని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. ఈనెల 13న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయంలతో కలిసి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, ఏఆర్వో నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు ఎన్నికల కమిషన్ నుంచి ఎప్పటికప్పుడు వచ్చే ఆదేశాలను క్షుణ్ణంగా చదవాలని ఆదేశించారు. ఏదైనా కారణాలతో ప్రిసైడింగ్ అధికారి ఎన్నికలు నిర్వహించలేకపోతే అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి కూడా ఎన్నికలు నిర్వహించే విధంగా సంసిద్ధంగా ఉండాలని నర్సింహారెడ్డి సూచించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మల్లాపూర్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని బీజేపీ మహిళా నాయకురాలు శశికళ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్లాపూర్ సూర్యనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన బాధ్యత ప్రతి మహిళపై ఉందన్నారు. విద్యతోనే మహిళల అభ్యున్నతి సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది నాగలక్ష్మీ, సరోజ, లక్ష్మీ, జ్యోతి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రమణీయం సత్యదేవుని రథోత్సవం



రామంతాపూర్: సత్యదేవుని ఆలయ 50వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 8 గంటల నుంచి నిర్వహించిన రథోత్సవంలో శ్రీరమాదేవి సమేత సత్యనారాయణ స్వామి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. పలు వీధుల్లో రథోత్సవం జోరుగా సాగింది. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కోట్ల నర్సింహారెడ్డి, ఈవో సత్యచంద్రరెడ్డి, ప్రధాన అర్చకులు విజయసారథి, తిరుపతాచార్యులు, శేషాచార్యులు, సీతారామచార్యులు, అన్నమనేని జగదీష్, భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది మురళీధర్‌రావు, శంకర్, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం



అంబులెన్స్‌లో పుట్టిన బిడ్డతో తల్లి, టెక్నిషియన్ నాగరాజు

ఉప్పల్: నిండు గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో గురువారం ఉప్పల్ 108 అంబులెన్స్‌కు సమాచారం అందింది. హుటాహుటిన టెక్నిషియన్ నాగరాజు, పైలెట్ వెంకటరమణ బోడుప్పల్‌కు చెందిన పెద్దిరాజు లక్ష్మీ(35) ఇంటికి చేరుకున్నారు. వెంటనే ఆమెను అంబులెన్స్‌లోకి ఎక్కించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో టెక్నిషియన్ నాగరాజు వాహనాన్ని నిలిపి పురుడు పోశాడు. మగబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. అనంతరం వారిని చికిత్స నిమిత్త గాంధీ ఆస్పత్రికి తరలించారు.

నాచారం కార్పొరేటర్‌కు పితృవియోగం



విఠల్ సిద్ధాంతి(ఫైల్)

మల్లాపూర్: జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి తండ్రి ప్రముఖ జ్యోతిష పండితులు అయిటి పాముల విఠల్ సిద్ధాంతి(77) గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. విఠల్ సిద్ధాంతికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, అందులో చిన్న కూతురు శాంతి సాయిజెన్. అంత్యక్రియలను యాద్రాది జిల్లా వలిగొండ మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు అభినందనలు

హబ్సిగూడ: బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే కోటా కింద తెలంగాణ శాసన మండలి(ఎమ్మెల్సీ) అభ్యర్థులుగా దేశపతి శ్రీనివాస్, నవీన్‌కుమార్, వెంకటరామిరెడ్డి గురువారం అసెంబ్లీలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై వారిని అభినందించారు. బీఆర్‌ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, లేతాకుల రఘుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

ఈద్గా షెడ్ నిర్మాణానికి నిధుల మంజూరుపై హర్షం



మేయర్‌ను సన్మానిస్తున్న మైనార్టీ కమిటీ సభ్యులు, బన్నాల ప్రవీణ్ తదితరులు

ఉప్పల్: చిలుకానగర్ బీఆర్‌ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో చిలుకానగర్ డివిజన్ ప్రాంతానికి చెందిన ముస్లింలు ఘనంగా సన్మానించారు. డివిజన్ పరిధిలో మైనార్టీ ఖబరస్థాన్‌లో రూ.39 లక్షలతో ఏర్పాటు చేసిన ఈద్గా షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈద్గా ఫ్లోరింగ్ పెండింగ్ పనులకు అదనంగా నిధులు మంజూరు చేయాలని కోరడంతో సానుకూలంగా స్పందించిన ఆమె పనులు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అబ్బుబాయ్, బీఆర్‌ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, ఎదుల కొండల్‌రెడ్డి, హనీఫ్, జలీల్ పాషా, ఫొటో బాలు, శ్యామ్ తదితరులు ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత





గౌతంనగర్: సీఎం సహాయ నిధిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని టీఆర్‌ఎస్ నేత మేకల రాముయాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్‌కు చెందిన బాలరాజ్ కుమారుడికి వెన్నుపూస చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.1.20 లక్షల చెక్కును గురువారం రాముయాదవ్ బాల్‌రాజు కుటుంబ సభ్యులను అందజేశారు.

దయాలసిస్ కోసం..

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ ఎస్పీనగర్‌కు చెందిన రాములుకు కిడ్నీ డయాలసిస్ వైద్య పరీక్షల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.50 లక్షల చెక్కును గురువారం టీఆర్‌ఎస్ మల్కాజిగిరి అధికార ప్రతినిధి జీఎస్‌వీ.సతీష్‌కుమార్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఇంటిపన్ను వసూళ్లలో అవకతవకలు

మేడిపల్లి: పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో ఇంటి పన్నుల వసూళ్లలో జరుగుతున్న అవకతవకలపై బీజేపీ ఆధారాలతో సహా వెలుగులోకి తీసుకొచ్చారు. బహుళ అంతస్తుల యజమానులు లక్షల్లో అద్దెలు వసూలు చేస్తూ వేలల్లో పన్నులు కడుతున్నారని గురువారం బీజేపీ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు నెమిలికొండ అనిల్‌రెడ్డి పూర్తి ఆధారాలను కమిషనర్ రామకృష్ణారావు ముందుంచారు. పీఎంసీలో దాదాపు 100కు పైగా బహుళ అంతస్తుల వ్యాపార భవనాలకు నివాస గృహాలుగా ట్యాక్స్‌లు విధించడంలో మతలబు ఏమిటని కమిషనర్‌ను ప్రశ్నించారు. ఇంతగా అవకతవకలు జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహించడం అన్యాయం అన్నారు. మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకొని ఇంటిపన్ను అందరికీ సమానంగా వసూలు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. భోగ రామచందర్, గీతారాం తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

‘టెన్త్’లో ప్రథమస్థానంలో నిలపాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలో మేడ్చల్‌ను ప్రథమ స్థానంలో ఉంచేలా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి విజయకుమారి తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతపై ప్రధానోపాధ్యాయులు, ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో గురువారం రెండు రోజుల పాటు జరిగే సమీక్ష సమావేశాన్న ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి విజయకుమారి ..ప్రభుత్వ పాఠశాలల్లో తక్కువ ఉత్తీర్ణత శాతం వచ్చిన ప్రధానోపాధ్యాయులను అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే 30 రోజులు ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాలో అన్ని పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం 7వ వార్డులో కౌన్సిలర్ గూడు సబితా ఆంజనేయులు గౌడ్‌తో కలిసి ఆయన కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ సింధుజా, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి



వంజర కృష్ణ(ఫైల్)

అల్వాల్: సైకిల్ అదుపు తప్పి కిందపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలోని అంతయ్య కాలనీలో నివాసముండే వంజర కృష్ణ(60) చేపల వ్యాపారి. ఈ నెల 8వ తేదీన తన సైకిల్‌పై వెళ్తుండగా ఆర్‌కే పురం ఫ్లైఓవర్‌పై సైకిల్ అదుపుతప్పి పడటంతో కిందపడి గాయాలపాలయ్యాడు. పొట్టకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడు గురువారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని గృహిణి ఆత్మహత్య



షేక్ మహబూబ్‌బి (ఫైల్)

అల్వాల్: గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని నందికొట్కూరు నంద్యాలకు చెందిన షేక్ ఖాజామియా(40), షేక్ మహబూబ్‌బి(33) భార్యాభర్తలు. బతుకుదెరువు నిమిత్తం నేరేడ్‌మెట్‌లోని కాకతీయనగర్‌కు వచ్చి నివాసం ఉంటున్నారు. భర్త టైలర్.. మద్యానికి బానిసయ్యాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె బుధవారం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌సీని తరలించాలని వినతి

మల్కాజిగిరి: మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును మెడికల్ అధికారిని డాక్టర్ కపూర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. భరణి కాలనీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని ఎల్‌బీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లోకి మార్చాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. భరణి కాలనీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చేవారికి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని, డెలివరీకి వచ్చేవారు తిప్పలు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.



ఎమ్మెల్యే మైనంపల్లికి వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ కపూర్

టెక్నోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని ఎమ్మార్‌ఐటీ కళాశాలలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న టెక్నికల్ ఈవెంట్ టెక్నోత్సవ్ పోస్టర్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు ఆవిష్కరించారు. ఈ నెల 28,29 తేదీలలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

మేడ్చల్: పట్టణంలోని ఐటీఐ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద నిరుద్యోగ యువతకు వివిధ కోర్సులలో ఉచితంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి వారికి ఉపాధి కలిపిస్తున్నట్లు ఆమె తెలిపారు.

వ్యక్తిపై కుక్కల దాడి

మేడిపల్లి: పీర్జాదిగూడ 11వ డివిజన్‌లో కుక్కల దాడిలో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. గురువారం ఉదయం భూపాల్‌రెడ్డి వాకింగ్‌కు వెళ్లగా రోడ్డుపై ఉన్న కుక్కలు ఒక్కసారిగా అతడిపై దాడిచేసి కలిచాయి. వంగేటి ప్రభాకర్‌రెడ్డి, నగర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రంజిత్‌రెడ్డి ఆయనను పరామర్శించారు.



శ్మశానవాటిక అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం

కీసర: కీసర శ్మశాన వాటిక అభివృద్ధి పనుల కోసం తన తండ్రి చిత్తర్ల మల్లేష్‌గౌడ్ జ్ఞాపకార్థం రూ.5 లక్షల విలువచేసే ఇసుక, కంకర, తదితర వస్తుసామగ్రిని విరాళంగా అందజేయనున్నట్లు కీసర పంచాయతీ కోఆప్షన్‌సభ్యుడు చిత్తార్ల రమేష్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన కీసరలో విలేకరులతో మాట్లాడారు. తాను ఇచ్చిన సామగ్రితో సుమారు 2 ఎకరాల విస్తీర్ణంలో శ్మశానవాటిక చుట్టూ బేస్‌మెంట్ నిర్మాణం చేపడతామన్నారు.

మంచినీరు వృథా


మేడ్చల్ రూరల్: రాజబొల్లారం గ్రామ పరిధిలోని మోనార్క్ కంపెనీ సమీపంలో మేడ్చల్–శామీర్‌పేట్ రోడ్డు పక్కన ఉన్న మిషన్ భగీరథ పైపు నుండి నీరు వృథా అయింది. గంటల తరబడి నీరు వృథా అవుతున్న విషయాన్ని తెలుసుకున్న సిబ్బంది మరమ్మత్తులు చేసి నీటిని నియంత్రించారు.

మహిళామణులకు సన్మానం

ఉప్పల్: ఉప్పల్ ఎన్‌జీఆర్‌ఐ సంస్థలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ‘అదర్ కోహినూర్, ది రాక్ ఆఫ్ హైదరాబాద్’ డైరెక్టర్, నిర్మాత ఉమా మంగల్ హాజరయ్యారు. అనంతరం ఎన్‌జీఆర్‌ఐలో ఏర్పాటు చేసిన రాక్ మ్యూజియంను సందర్శించి రెండు వేల బిలియన్ సంవత్సరాల రాళ్లను చూసి పరవశించారు. రాళ్లను చూస్తూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తాను నిర్మించే చిత్రం నిజమైన రాక్ ప్రేమికులను ఆకట్టుకుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉమామంగల్‌తోపాటు డైరెక్టర్ డా.ప్రకాశ్ కుమార్ ఉన్నారు.

వినాయక్‌నగర్‌లో..

మౌలాలి: సంతోషి మా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వినాయక్‌నగర్ డివిజన్ చంద్రగిరి కాలనీలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ హాజరై కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు.




మౌలాలి కార్పొరేటర్ సునీతను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి మల్లిఖార్జున్, కమ్యూనిటీ ఆర్గనైజర్ రాములు, బీఆర్‌ఎస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు అరుంధతి, పావని, రాధ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ సునీతకు సన్మానం

మౌలాలి: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని డివిజన్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉడుత నవీన్, కిరణ్, సాయిబాబు, గడప నవీన్, రమేష్ రాథోడ్ పాల్గొన్నారు.



ఉప్పల్ ఎన్‌జీఆర్‌ఐలో మహిళా దినోత్సవంలో చిత్ర నిర్మాణ ఉమా మంగల్

అరోరాలో మహిళా దినోత్సవం

రామంతాపూర్: అరోరా పీజీ కళాశాలలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్విత ఉమెన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చీరకట్టు, మేకప్, శిరోజాల అలంకరణలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ మాధవి, డాక్టర్ శ్రీలత, కీర్తన, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



అరోరాలో మహిళా దినోత్సవం



వినాయక్‌నగర్‌లో మహిళా దినోత్సవం